క్లుప్తంగా

వైభవ వేంకటేశ్వరస్వామికి పౌర్ణమి పూజలు



కొత్త వెంకోజీపాలెంలో వైభవ వేంకటేశ్వరస్వామి

మద్దిలపాలెం : కొత్త వెంకోజీపాలెంలోని వైభవ వేంకటేశ్వరస్వామికి పౌర్ణమి సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. భాద్రపద పౌర్ణమి పురస్కరించుకుని అభిషేకాలు నిర్వహించారు. పసుపు, కుంకుమ, చందనంతో పాటు పంచామృతాభిషేకాలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సేవ కమిటీ సభ్యులు, మహిళా మండలి సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

రక్తదానానికి యువత ముందుకు రావాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

బీచ్ రోడ్డు: రక్తదానానికి యువత మరింత చొరవ చూపాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి అన్నారు. వచ్చే నెల 8న గాజువాక బీసీ రోడ్డు కాకతీయ జంక్షన్‌లో టీమ్ ఢిల్లీ సనపల నిర్వహించనున్న మెగా రక్తదాన శిబిరం వాల్ పోస్టర్‌ను శుక్రవారం తన చాంబర్‌లో వీసీ ఆవిష్కరించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో వీసీ మాట్లాడుతూ రక్తదానంతో పలువురి ప్రాణాలు కాపాడవచ్చునని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం, టీమ్ ఢిల్లీ ప్రతినిధులు సనపల ఢిల్లీ, అనిల్ కుమార్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష' విజయవంతానికి పిలుపు

బీచ్ రోడ్డు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు విజయవంతం చేయాలని రాష్ట్ర శిష్టకరణ కార్పొరేషన్ చైర్‌పర్సన్ అనూష పట్నాయక్ ఒక ప్రకటనలో కోరారు. శనివారం నుంచి ప్రారంభం కానున్న ఈ కార్యక్రమం ద్వారా ప్రజల వద్దకే వైద్యం వెళ్తుందని పేర్కొన్నారు. ఇప్పటికే సురక్ష సర్వేను విజయవంతంగా పూర్తి చేశారన్నారు. ప్రత్యేక వైద్య శిబిరాలను కూడా విజయవంతం చేసి ప్రజలకు ఆరోగ్య భరోసా కల్పించాలన్నారు.

బీసీ జనగణన హర్షణీయం

బీచ్ రోడ్డు: రాష్ట్రంలో బీసీ కుల జనగణన చేపట్టాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తీసుకున్న నిర్ణయంపై రాష్ట్ర శిష్టకరణ కార్పొరేషన్ చైర్‌పర్సన్ అనూష పట్నాయక్ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తరహాలో ప్రస్తుత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కూడా బీసీలకు పెద్ద పీట వేస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటికే బీసీలకు అన్ని రంగాల్లో, చట్ట సభల్లో ప్రాధాన్యం కల్పించిన వైఎస్ జగన్.. ఇప్పుడు బీసీల కుల జనగణన చేపట్టి బీసీల పక్షపాతిగా నిలిచారని తెలిపారు.

గుండె వ్యాధులపై అవగాహన ర్యాలీ

ఆరిలోవ: ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా హెల్త్‌సిటీలోని కేర్ ఆస్పత్రి, ముడసర్లోవ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కేర్ ఆస్పత్రి నుంచి హనుమంతవాక వరకు నిర్వహించిన ఈ ర్యాలీని ఆరిలోవ సీఐ సోమశేఖర్ ప్రారంభించారు. ర్యాలీ అనంతరం ఆస్పత్రి ఆవరణలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ర్యాలీలో పాల్గొన్న వారికి గుండె సంబంధిత పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యులు, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

పేదల ఆర్థికాభ్యున్నతికే పథకాలు

- వైఎస్సార్‌సీపీ తూర్పు సమన్వయకర్త, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ
- 12వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం



సంక్షేమ పథకాల వివరాలతో ముద్రించిన కర పత్రాన్ని మహిళకు అందిస్తున్న ఎంపీ ఎంవీవీ, కార్పొరేటర్ రోహిణి

ఆరిలోవ: రాష్ట్రంలోని పేదల ఆర్థిక అభ్యున్నతికే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని, వాటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ అన్నారు. జీవీఎంసీ 12వ వార్డులో కార్పొరేటర్ అక్కరమాని రోహిణి ఆధ్వర్యంలో శుక్రవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీ ముఖ్యఅతిథిగా పాల్గొని వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకులతో కలిసి విద్యానగర్ కాలనీ, క్రాంతినగర్, వీఎస్టీ స్కూల్ రోడ్డు, మయూరినగర్, జ్యోతినగర్‌లో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల వివరాలతో ముద్రించిన కర పత్రాలను గృహిణులు, వృద్ధులు, యువకులకు అందించారు. సంక్షేమ పథకాల ద్వారా ఏవిధంగా లబ్ధి పొందారో అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందిన ప్రతి కుటుంబం ఆర్థికంగా బలపడాలన్నది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆకాంక్ష అని తెలిపారు. పేదవాడి ముఖంలో చిరునవ్వు చూడాలని ఆశిస్తున్నారన్నారు. అమ్మ ఒడి, విద్యా దీవెన, వసతి దీవెన తదితర పథకాలు అమలు చేస్తూ పేద విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కన్నేటి సుబ్బారెడ్డి, అల్లంపల్లి రాజబాబు, చొక్కర శేఖర్, బోని శివ రామకృష్ణ, జి.విక్టర్, హుస్సేన్, సుజాత, రాజులమ్మ, రత్నం, అర్జున్, మోహన్, వరహాలు, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

సింహగిరిపై ఆర్జిత సేవలు పునః ప్రారంభం



అప్పన్న కల్యాణ ఉత్సవమూర్తులు

సింహాచలం: సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో శుక్రవారం నుంచి ఆర్జిత సేవలు పునఃప్రారంభమయ్యాయి. పవిత్రోత్సవాల సందర్భంగా ఈ నెల 24 నుంచి 28 వరకు అన్ని ఆర్జిత సేవలు రద్దు చేసిన విషయం తెలిసిందే. పవిత్రోత్సవాలు ముగియడంతో తిరిగి ఆర్జిత సేవలను పునరుద్ధరించారు. ఉదయం 9.30 నుంచి నిత్యకల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణ ధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్య ధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

ఘనంగా గరుడసేవ

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శుక్రవారం గరుడసేవ ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఆలయ కల్యాణ మండపంలోని గరుడవాహనంపై అధిష్టింపజేశారు. అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు. విశేషంగా హారతులు అందజేశారు.

ఐఐఏఎంలో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం

ఎంవీపీ కాలనీ: ఎంవీపీ కాలనీలోని ఇంటిగ్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జరిగే ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం శుక్రవారం ప్రారంభమైంది. అవుట్‌కమ్ బేసిడ్ ఎడ్యుకేషన్ అనే అంశంపై సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ లీడర్‌షిప్ ఇన్ ఎడ్యుకేషన్ (పూణే) డైరెక్టర్ ఆచార్య అజిత్ ఆర్.థెటె ఈ సందర్భంగా అధ్యాపకులకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఐఐఏఎం కార్యదర్శి సుంకరి రవీంద్ర, తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ



క్షీరాభిషేక సేవలో సిరులతల్లి

డాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో కె. శిరీష తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులను లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. పై పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891-2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఆలయ ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, పర్యవేక్షకుడు ముద్దాడ రమణ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా పరిహారాల పంపిణీ



శెట్టి బలిజ కాలనీలో మృతుని కుటుంబానికి బీమా నగదు అందిస్తున్న కార్పొరేటర్ శ్రీవిద్య



వైఎస్సార్ బీమా సొమ్ము అందిస్తున్న కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్

మద్దిలపాలెం/బీచ్ రోడ్డు : వైఎస్సార్ బీమా పరిహార చెక్కులను పలువురు లబ్దిదారులకు అందజేశారు. జీవీఎంసీ 15వ వార్డు శెట్టిబలిజ కాలనీలో అనారోగ్యంతో మృతి చెందిన కేసబోయిన రాము(35) కుటుంబానికి కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య శుక్రవారం వైఎస్సార్ బీమా తక్షణ సాయం రూ.10 వేలు అందజేశారు. మిగతా రూ.90 వేలు బ్యాంకు ఖాతాలో జమ అవుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి అప్పారి గిరిబాబు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

- జీవీఎంసీ 22వ వార్డు పిఠాపురం కాలనీకి చెందిన ఎం.తాతారావు అనారోగ్యంతో గురువారం మృతి చెందాడు. వైఎస్సార్ బీమా పథకం కింద దహన సంస్కరణ నిమిత్తం ఆయన కుటుంబ సభ్యులకు శుక్రవారం రూ. 10 వేలును జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే వైఎస్సార్ బీమాతో మృతుల కుటుంబాలకు ఆర్థికంగా అండగా నిలవడం అభినందనీయమని మూర్తి యాదవ్ అన్నారు.

సత్యదేవుని ఆలయంలో పౌర్ణమి పూజలు

డాబాగార్డెన్స్ : నగరంలోని ఇసుకకొండ(బాబాజీ కొండ)పై వెలసిన రమా సహిత సత్యనారాయణ స్వామి ఆలయం శుక్రవారం భక్తులతో కిటకిటలాడింది. భాద్రపద పౌర్ణమి సందర్భంగా స్వామికి ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు జరిపారు. వేకువ జాము 4 గంటల నుంచే భక్తులు స్వామి దర్శనానికి బారులు తీరారు. ఆలయ మండపంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు జరిగాయి. ఆలయ ఈవో బుద్ద మహాలక్ష్మి నగేష్ పర్యవేక్షించారు. సాయంత్రం వరకు భక్తుల తాకిడి కనిపించింది. వేకువజాము 4 గంటలకు అనివెట్టి మండపం వద్ద సామూహిక వ్రతాలు, ప్రత్యేక పూజలు, ధ్వజస్తంభ పూజలు జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి ఆలయ మండపంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు.

ఉత్సాహంగా 'నా దేశం-నా మట్టి' ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న తోటగరువు హైస్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు

ఆరిలోవ: కేంద్ర ప్రభుత్వం సూచనతో విద్యార్థుల్లో దేశ భక్తి కలిగించడానికి 'నా దేశం-నా మట్టి' కార్యక్రమం శుక్రవారం తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు పాఠశాల నుంచి తోటగరువు కూడలి వరకు జాతీయ జెండా, భారతమాత చిత్రపటం, ప్లకార్డులు, బ్యానర్ చేతపట్టి ర్యాలీ చేపట్టారు. దేశ సమైక్యతకు పాటు పడాలని, దేశ భక్తి కలిగి ఉండాలని నినాదాలు చేశారు.

దిక్కు లేని వృద్ధులకు ఆశ్రయం



ఏయూటీడీ ప్రతినిధి జ్యోతిర్మయికి పైడితల్లిని అప్పగిస్తున్న పట్నాయక్



నిరాశ్రయ వసతి గృహానికి రేఖను అప్పగిస్తున్న ద్వారకా పోలీసులు

అల్లిపురం : కన్నవారి ఆదరణకు నోచుకోని వృద్ధులకు జీవీఎంసీ ఏయూటీడీ నిరాశ్రయ వసతి గృహం నిర్వాహకులు అండగా నిలుస్తున్నారు. వసతి గృహం ప్రతినిధి ప్రగడ వాసు, మేనేజర్ జ్యోతిర్మయి తెలిపిన వివరాల ప్రకారం శ్రీకాకుళం జిల్లా, రాజాం మండలం, ఉద్వాల్ గ్రామానికి చెందిన సిరిసెట్టి పైడితల్లి కుటుంబ సభ్యుల నిరాదరణకు గురైంది. ఆగస్టు 28వ తేదీన సమాజ సేవకుడు పట్నాయక్ ఇచ్చిన సమాచారం మేరకు శివాజీపాలెం రోడ్డుపై ఉంటున్న పైడితల్లిని ఏయూటీడీ టీఎస్ఆర్ కాంప్లెక్స్ షెల్టర్ సిబ్బందికి అప్పగించారు. అప్పటి నుంచి ఆశ్రయం పొందుతున్న ఆమెకు శుక్రవారం మదర్ థెరిసా ఆశ్రమంలో ఆశ్రయం కల్పించారు. అదే విధంగా ఒడిశా రాష్ట్రానికి చెందిన రేఖ అనే వృద్ధురాలు ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురు రోడ్డుపై తిరుగుతుండగా జూన్ 23వ తేదీన టీఎస్ఆర్ కాంప్లెక్స్, ఏయూటీడీ నిరాశ్రయ వసతి గృహానికి అప్పగించారు. ఆమెకు చికిత్స అందజేసిన ఏయూటీడీ ప్రతినిధులు ఆమె ఆరోగ్యం మెరుగుపడటంతో ఆమెను కూడా మదర్ థెరిసా ఆశ్రమానికి అప్పగించినట్లు తెలిపారు.

ఆర్టీసీ పార్సిల్ సర్వీస్‌ను వినియోగించుకోండి



మద్దిలపాలెంలోని పార్సిల్ కౌంటర్‌ను పరిశీలిస్తున్న ఆర్టీసీ డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ అప్పలనాయుడు

అల్లిపురం: ఆర్టీసీ పార్సిల్ సర్వీస్‌ను అందరూ వినియోగించుకోవాలని ఆర్టీసీ జోన్-1 డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ బి.అప్పలనాయుడు కోరారు. మద్దిలపాలెం పార్సిల్ కౌంటర్‌ను శుక్రవారం ఆయన సందర్శించారు. బస్సుల రాకపోకల వివరాలు అడిగి తెలుసుకున్నారు. పార్సిల్ బుకింగ్స్‌పై ఆరా తీశారు. ఆయన వెంట ఏటీఎం రాజు, సిబ్బంది, సూపర్‌వైజర్స్, కంట్రోలర్స్ పాల్గొన్నారు.

లంబోదరుడికి దీపారాధన



దీపాలు వెలిగిస్తున్న మహిళలు

విశాఖ విద్య: జీవీఎంసీ 52వ వార్డు శాంతినగర్‌లో ఏర్పాటు చేసిన వరసిద్ధి వినాయక మండపం వద్ద శుక్రవారం రాత్రి దీపారాధన వేడుకగా జరిగింది. డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ దీపాలను వెలిగించి ప్రారంభించారు. పరిసర కాలనీలకు చెందిన మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని పార్వతీ తనయుడి చెంత భక్తి శ్రద్ధలతో దీపాలు వెలిగించారు. కార్యక్రమంలో జియ్యాని యూత్ నిర్వాహకులు జియ్యాని విజయ్, మారుతి తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ వినియోగం తప్పనిసరి

- ట్రాఫిక్ సీఐ అశోక్‌కుమార్

గోపాలపట్నం: ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ వాడకాన్ని అలవాటుగా మార్చుకోవాలని గోపాలపట్నం ట్రాఫిక్ సీఐ అశోక్ కుమార్ అన్నారు. బాలాజీ పాఠశాలలో ట్రాఫిక్ నియమాలపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు పాటించడం వల్ల ప్రమాదాలు నివారించవచ్చని వివరించారు. తల్లిదండ్రుల వాహనంపై వెళ్లేటప్పుడు హెల్మెట్ పెట్టుకోవాలని విద్యార్థులు చెప్పాలని సూచించారు. కుడి వైపు నుంచే ఓవర్ టేక్ చేయాలన్నారు. బస్సు నుంచి దిగేవారు అదే బస్సు ముందు నుంచి వెళ్లరాదని.. అలా వెళితే ప్రమాదానికి గురవుతారన్నారు. మైనర్లు వాహనం నడపరాదన్నారు. కార్యక్రమంలో గోపాలపట్నం ట్రాఫిక్ ఎస్ఐ శ్రీనివాసరావు, పాఠశాల ఉపాధ్యాయులు, ట్రాఫిక్ ఇబ్బంది పాల్గొన్నారు.

జోరుగా జర్నలిస్టుల సభ్యత్వ నమోదు



దరఖాస్తులు స్వీకరిస్తున్న సొసైటీ ప్రతినిధులు సత్యనారాయణ, రవికాంత్

అల్లిపురం : జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సాధనకు ఏర్పడిన అక్రిడేటెడ్ వర్కింగ్ జర్నలిస్టుల హౌసింగ్ సొసైటీ సభ్యత్వ నమోదు కార్యక్రమం రెండవ రోజు చురుగ్గా కొనసాగింది. డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్ క్లబ్‌లో జరిగిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో 250 మంది వరకు నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా సొసైటీ గౌరవాధ్యక్షుడు జి.జనార్దనరావు, అధ్యక్షుడు బి.రవికాంత్ మాట్లాడుతూ జర్నలిస్టుల స్థలాల సాధనకు ఐక్యంగా కృషి చేస్తున్నామన్నారు. సభ్యత్వ నమోదు ప్రక్రియ అక్టోబరు 1వ తేదీ ఆదివారం సాయంత్రం 4 గంటల వరకు కొనసాగుతుందన్నారు. దరఖాస్తుదారులు అక్రిడేషన్ కార్డు, ఆధార్ కార్డు, రెండు ఫొటోలతో దరఖాస్తు అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సలహాదారు పి.సత్యనారాయణ, డి.రవికుమార్, కోశాధికారి ఎ.శరత్‌కుమార్, ఉపాధ్యక్షుడు కె.పరశురామ్, పి.రామకృష్ణ, కార్యనిర్వాహక కార్యదర్శి బి.రమేష్, సహాయ కార్యదర్శులు ఎస్.అనురాధ, బందరు శివ, ప్రసాద్, చందు, రాజా, కోటి తదితరులు పాల్గొన్నారు.

ఎంఎస్ స్వామినాథన్ మరణం దేశానికి తీరనిలోటు



ఎంఎస్ స్వామినాథన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఆచార్యులు, తదితరులు

ఎంవీపీ కాలనీ: ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త, పద్మ విభూషణ్ డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్ మరణం దేశానికి తీరని లోటని ఏయూ ఎకనామిక్స్ విభాగాధిపతి ఆచార్య పల్లారావు అన్నారు. శుక్రవారం ఎకనామిక్స్ విభాగంలో స్వామినాథన్ చిత్రపటానికి ఆచార్యులు, విద్యార్థులు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆచార్య పుల్లారావు మాట్లాడుతూ డాక్టర్ స్వామినాథన్ వ్యవసాయరంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చి దేశాన్ని ఆహార ఉత్పత్తుల భాండాగారంగా మార్చారన్నారు. ఆయన చేసిన విప్లవాత్మక మార్పుల కృషి ఫలితంగానే దేశం ఆహార కొరతను అధిగమించగలిగిందన్నారు. ఆహార ఉత్పత్తుల సమస్యను సమర్థవంతంగా ఎదుర్కొంటూ.. ప్రపంచ దేశాలకు ఉత్పత్తులను ఎగుమతి చేసే స్థాయికి చేరామన్నారు. ప్రధానంగా 60 దశకంలో దేశానికి ఆహార కొరత నుంచి విముక్తిని కలిగించిన ఘనత స్వామినాథన్‌కు దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆచార్య నాగరాజు, డాక్టర్ ఆశాలత, డాక్టర్ రామకృష్ణ, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అన్నసమారాధనలు



అన్నసమారాధనలో పాల్గొన్న ఎంపీ ఎంవీవీ, తదితరులు

ఎంవీపీ కాలనీ: జీవీఎంసీ 18వ వార్డు ఎంవీపీ కాలనీ అప్పుఘర్‌లో అన్నసమారాధన కార్యక్రమం శుక్రవారం ఘనంగా జరిగింది. వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ ముఖ్యఅతిథిగా పాల్గొని భక్తులకు ఆహార పదార్థాలు వడ్డించారు. ముందుగా శ్రీవరసిద్ధి వినాయకుడి ప్రతిమకు ప్రత్యేక పూజలు చేవారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధి దిశగా ముందడుగు వేయాలంటే సీఎం జగన్ ప్రభుత్వం రానున్న ఎన్నికల్లో మారోసారి అధికారంలోకి రావాలన్నారు. ఆ దిశగా పార్టీ నాయకులు, ప్రజలు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ వార్డు ఇన్‌చార్జి పుక్కళ్ల ధనలక్ష్మి, పుక్కళ్ల శంకర్, వాసుపల్లి ఎల్లాజీ, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

16వ వార్డులో..

మద్దిలపాలెం: జీవీఎంసీ 16వ వార్డు అంబేడ్కర్ కాలనీలో శివ గణపతి బెస్ట్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన అన్నదాన కార్యక్రమాన్ని ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ ప్రారంభించారు. ఏపీఐఐసీ డైరెక్టర్ మొల్లి అప్పారావుతో కలిసి భక్తులకు ఆయన అన్నప్రసాదం వడ్డించారు. ఈ అన్నదానానికి ఎంపీ 18 బియ్యం బస్తాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మహిళా నాయకులు పోలరత్నం, ఇప్పిలి పార్వతి, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

దోమలున్నాయి.. జాగ్రత్త



బీఎస్ఆర్ నగర్‌లో ఇంటి ముందు నీటి డ్రమ్ములను పరిశీలిస్తున్న జెడ్సీ కనకమహాలక్ష్మి

ఆరిలోవ: ప్రజలు దోమలతో జాగ్రత్తగా ఉండాలని జీవీఎంసీ జోన్-2 కమిషనర్ కనకమహాలక్ష్మి సూచించారు. 11వ వార్డు బీఎస్ఆర్ నగర్‌లో పారిశుధ్య, మలేరియా విభాగాల ఆధ్వర్యంలో శుక్రవారం డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బందితో కలిసి ఆమె అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి నీటి నిల్వలు పరిశీలించారు. ఇంటి ముందు నీటి కుండీలు, డ్రమ్ముల్లో నిల్వ ఉన్న నీటిలో లార్వా పరిశీలించి, ఆ నీటిని పారబోశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ దోమల కారణంగా మలేరియా, డెంగ్యూ వ్యాధులు వ్యాపిస్తున్నాయన్నారు. ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ నమ్మి బంగారురాజు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

బాలల హక్కుల పరిరక్షణకు ప్రాధాన్యం



పోలీస్ కమిషనర్ రవిశంకర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న గొండు సీతారాం

సీతమ్మధార: బాలల హక్కుల పరిరక్షణ నగరంగా విశాఖను తీర్చిదిద్దుదామని పోలీస్ కమిషనర్ డాక్టర్ రవిశంకర్ అయ్యనార్ అన్నారు. ఇటీవల నగర సీపీగా బాధ్యతలు చేపట్టిన ఆయనను చాంబర్‌లో శుక్రవారం రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. అనంతరం కమిషనర్‌తో ఆయన భేటీ అయి వివిధ అంశాలపై చర్చించారు. బాలల భిక్షాటన, బాల కార్మిక వ్యవస్థ, బాలల అక్రమ రవాణా, బాల్య వివాహాలు, వివిధ పిల్లల కేసులు, కారణాలు, ప్రభావిత అంశాల గురించి ప్రస్తావించారు. ఈ సందర్భంగా సీపీ రవిశంకర్ మాట్లాడుతూ బాలల హక్కుల పరిరక్షణ, భద్రతను దృష్టిలో ఉంచుకొని నగరంలోని అన్ని పోలీస్ స్టేషన్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేస్తామన్నారు. బాలల స్నేహపూర్వక స్టేషన్లుగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలతో అడుగులు వేస్తామని చెప్పారు. పోలీస్ అధికారులను సమన్వయ పరిచి, పిల్లలకు సంబంధించి అన్ని అంశాల పరిష్కారానికి సమావేశాలను ఏర్పాటు చేస్తామన్నారు. గొండు సీతారాం మాట్లాడుతూ వివిధ అంశాల పరిష్కారం దిశగా సీపీతో భేటీలో చర్చకు రావడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రొబెషనరీ ఆఫీసర్ ఎం.శరత్ పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరిస్తే ఉద్యమిస్తాం



లేబర్ గేటు వద్ద జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న నాయకులు

మల్కాపురం: స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించాలనే ఆలోచనను కేంద్రం వెంటనే ఉప సంహరించుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కె.లోకనాథం హెచ్చరించారు. ప్లాంట్ ప్రైవేటీకరణ అంశాన్ని వ్యతిరేకిస్తూ సీపీఎం మల్కాపురం జోన్ కమిటీ పిలుపు మేర శుక్రవారం బైక్ ర్యాలీ, నిరసన కార్యక్రమాలు చేపట్టారు. జింక్ నుంచి మల్కాపురం వరకు జరిగిన బైక్ ర్యాలీలో లోకనాథం మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ఉంటేనే పారిశ్రామిక ప్రాంత ప్రజలకు మనుగడ అని అన్నారు. బీజేపీ ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌ను బడా బాబుల చేతుల్లో పెట్టేందుకు యత్నిస్తుందని ఆరోపించారు. ఈ సమస్యపై పోరాడాల్సిన టీడీపీ, జనసేన పార్టీలు వారికి చెక్క భజన చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు,నాయకులు పైడిరాజు,ఆర్.లక్ష్మణమూర్తి,పెంటారావు,ఆర్.విమల తదితరులు పాల్గొన్నారు.